నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, శనివారం 23 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీ నృసింహుడికి వైభవంగా నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, మార్చి 22 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి నిత్యోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారు జూమున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేశారు. నిజరూప దర్శనంలో నారసింహ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. భూతపేత పిశాచాల బాధలు తొలగి, ఇలలోక సుఖాలు, పరలోక మోక్షాలు సిద్ధించే హోమంలో భక్తులు పాల్గొని మొక్కు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సుమారు గంటన్నరకు పైగా జరిగిన నిత్య తిరుకల్యాణ తంతును భక్తులు పాల్గొని వీక్షించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులు సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ వైభవంగా నిర్వహించారు. ఆండాళ్ అమ్మవారికి ఊంజల్‌సేవను జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 9 వేల మంది భక్తులు యాదగిరీశుడిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 16,51,136 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

కొలనుపాకలో కత్తులతో విన్యాసాలు చేస్తున్న వీరశైవ భక్తులు

వైభవంగా రేణుకాచార్య రథోత్సవం

ఆలేరు రూరల్, మార్చి22 : జగద్గురు రేణుకాచార్య జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కొలనుపాకలో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. సోమేశ్వరాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం పుర వీధుల గుండా కొనసాగింది. కర్ణాటకతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వీరశైవ జంగమ కళాకారులు రథోత్సవంలో ప్రదర్శన నిర్వహించారు. ఆయుధాలతో విన్యాసాలు చేస్తూ శైవ దేవతల వేషాలతో ఆకట్టుకున్నారు. బిచ్చుకుంద, శివాచార్య భక్తులకు అశీస్సులు అందజేశారు. సోమేశ్వరాలయంలో జయంతి ఉత్సవ పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం ఆలయం ప్రాంగణంలో జయంతి ఉత్సవ ధార్మిక సభను నిర్వహించగా జగద్గురు శివాచార్య వీరశైవ సందేశాన్ని భక్తులకు అందించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్తలు గంగుల శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులు, ఆలయ పూజారులు సోమయ్య, గంగాధర్, చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న నీటి ఎద్దడి

జిల్లాలో మోగుతున్న ప్రమాద ఘంటికలు

- హెచ్‌ఎండబ్ల్యూఎస్ నుంచి సరిపడా రాని నీరు
- 70ఎంఎల్‌డీలకు.. వస్తున్నది 34ఎంఎల్‌డీలే..
- మిషన్ భగీరథలో బోరు నీళ్లు కలిపి పంపిణీ
- వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్న జనం
- పట్టణాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా
- ఇట్లయితే వేసవిలో పానీపట్టు యుద్ధాలే..

యాదాద్రి భువనగిరి, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మంచినీటి ఎద్దడి ముంచుకొస్తున్నది. వేసవి ప్రారంభంలోనే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాకు మిషన్ భగీరథ నీరు సరిపోను రావడం లేదు. ఫలితంగా తాగునీటికి కటకట ఏర్పడుతున్నది. మిషన్ భగీరథ నీళ్లలో స్థానిక బోర్ల నీళ్లను కలిపి అందిస్తున్నారు. అది కూడా వారానికి రెండు సార్లు కూడా నల్లాలకు వదలడంలేదు. మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పలు గ్రామాల్లో ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడే ఇట్లుంటే వేసవిలో పరిస్థితి ఏందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భువనగిరి పట్టణంలోని ఎనిమిదవ వార్డులో మున్సిపల్ ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళలు

జిల్లాకు 34 ఎంఎల్‌డీలే..

జిల్లావాసులకు వేసవిలో నీటి కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. నిత్యావసరాల కోసం వాడుకునే తాగునీటికి అప్పుడే కొరత ఏర్పడింది. జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లోని 549 ఆవాసాలకు హైదరాబాద్ మెట్రో వాటర్ గ్రిడ్ నుంచి మిషన్ భగీరథ నుంచి నీరు సరఫరా అవుతున్నది. ఆయా గ్రామాల్లో ప్రజల కోసం రోజుకు 70ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్ డే) నీరు అవసరం. గతంలో సుమారుగా ఇదే స్థాయిలో నీర సరఫరా అయ్యేది. కానీ ప్రస్తుతం 34 ఎంఎల్‌డీలు మాత్రమే జిల్లాకు వస్తున్నాయి. ఇక చౌటుప్పల్, నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల్లోని 144 ఆవాసాలకు నల్లగొండ జిల్లాలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి జలాలను సరఫరా చేస్తున్నారు. రామన్నపేట, మోత్కూర్, అడ్డగూడూర్ మండలాల్లోని 76 ఆవాసాల్లో పానగల్ రిజర్వాయర్ నుంచి కృష్ణానీటిని అందిస్తున్నారు. ఇవి కూడా అంతంతమాత్రంగానే వస్తున్నాయి. దీంతో ప్రజలకు పూర్తి స్థాయిలో నీరు అందడం లేదు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా..

తెలంగాణ రాష్ట్రం వచ్చాక గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి నీటి బాధలు షురూ అయ్యాయి. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో తిప్పలు తప్పడం లేదు. సరిపడా నీళ్లు లేకపోకపోవడంతో మిషన్ భగీరథ నీళ్లలోనే స్థానిక బోరు నీళ్లను కలిపి సరఫరా చేస్తున్నారు. అది కూడా వారానికి రెండు సార్లు మాత్రమే అందిస్తున్నారు. కొన్ని చోట్ల నీటి సరఫరా లేకపోవడంతో వాటర్ ట్యాంకర్లే దిక్కవుతున్నాయి. కాలనీల్లో ట్యాంకర్ల నుంచి పట్టుకొని డ్రమ్ముల్లో నింపుకొంటున్నారు. ఇవి కనీస అవసరాలకు కూడా చాలకపోవడంతో ఎప్పుడో వచ్చే వాటర్ ట్యాంకర్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భువనగిరి పట్టణంలోని అన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మకాలనీలో నివసిస్తున్న ప్రజలకు ట్రాక్టర్ల ద్వారా అందించే ట్యాంకర్ల నీళ్లే ఆధారం. అక్కడ రెండు వాటర్ ట్యాంక్‌లు ఉన్నప్పటికీ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

వాటర్ ప్లాంట్లు.. బోరు నీరే దిక్కు..

ఇక కొన్ని గ్రామాల్లో నీళ్లు లేక బోరింగ్‌లు, వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. గ్రామాలు, తండాల్లో కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. మళ్లీ ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఇక మిషన్ భగీరథ నీళ్లు సరిపడా అందకపోవడంతో జనం వాటర్ ప్లాంట్లకు క్యూ కడుతున్నారు. వాటర్ ప్లాంట్లలో నీటిని కొనుగోలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. వేసవి కావడంతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులకు పంట పండుతున్నది.

పడిపోతున్న భూగర్భ జలాలు

ఇంకా వేసవి ఆరంభం కాలేదు. ఎండలు ముదరలేదు. కానీ అప్పుడే నీటి కష్టాలు షురూ అయ్యాయి. ముఖ్యంగా గ్రామాలు, తండాల్లో నీటి ఎద్దడి మొదలైంది. భగీరథ నీరు సరిపడా రాకపోవడంతోపాటు భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. నీటి మట్టం పడిపోవడంతో బోర్లలో కూడా జలాలు అడుగంటుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో మరింత తీవ్ర నీటి ఎద్దడి నెలకొనే ప్రమాదం లేకపోలేదు.

వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు

- ఎఫ్‌డీఓ సర్వేశ్వర్

చందంపేట, మార్చి 22 : వేసవిలో నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నట్లు ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ తెలిపారు. మండలంలోని చిత్రియాల, కంబాలపల్లి, పాత కంబాలపల్లి, పెద్దమూల గ్రామాల్లోని అటవీ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి బీట్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. వేసవిలో వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు సాసర్ పిట్స్‌లో నీటిని నింపడంతోపాటు బోర్లు వేయించాలని సూచించారు. ఇప్పటికే నల్లమల అటవీ ప్రాంతంలో మూడు బోర్లు వేయించామని, కొత్తగా 8 సాసర్ పిట్స్ ఏర్పాటు చేశామని అన్నారు.

కంబాలపల్లి అటవీ ప్రాంతంలో సాసర్ పిట్స్‌లో నీటిని పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ సర్వేశ్వర్

పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా ?

- రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి లేని సర్కారు
- రైతులు చెప్పతో కొడుతారనే భయంతో పంటల పరిశీలనకు మంత్రులు రావడం లేదా?
- కోమటిరెడ్డివి బ్లాక్ మెయిల్ రాజకీయాలు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- భూదాన్‌పోచంపల్లి మండలంలో ఎండిన పంటల పరిశీలన

భూదాన్ పోచంపల్లి, మార్చి 22 : కండ్ల ముందు పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేలకు రైతులంటే చిన్నచూపు ఎందుకని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం అంతమ్మగూడెం, ధోతిగూడెం గ్రామాల్లో శుక్రవారం నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలాలను జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు బంధు సమితి మాజీ జిల్లా కోఆర్డినేటర్ కొలుపుల అమరేందర్, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల గోల తప్ప ఎన్నో కష్టాలు పడుతున్న రైతులపై కనికరం లేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు ఇబ్బంది పెడుతుంటే పాలకులు నిర్లక్ష్యంగా ఉండడం తగదన్నారు. లో ఓల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోతున్నాయని, దాంతో సకాలంలో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ సర్కారులో 60 వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చి, విద్యుత్ సమస్య లేకుండా చూశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని, జిల్లా మంత్రి ఎండిన పంట పొలాలను పరిశీలించిన పాపాన పోలేదని విమర్శించారు. గుళ్లు తిరుగడం మంచిదేగానీ పక్కనే ఎండిపోతున్న పంట పొలాలను మంత్రి పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చే సమయం లేదా అని ప్రశ్నించారు. ఎండిపోయిన పంటలపై సమగ్ర సర్వేను చేపట్టి రైతులను నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎండిన పంట పొలాలను పరిశీలించే సోయిలేని జిల్లా మంత్రి వసూలు దందాలు, రౌడీయిజం తప్ప, ప్రజా సంక్షేమం పట్టదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు రాలేదన్న వాడిని చెప్పుతో కొట్టమన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, ఎండిన పంటల పరిశీలనకు వస్తే చెప్పుతో కొడుతారనే భయంతో రావడం లేదా అని ఎద్దేవా చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యానికి గిట్టుబాటుకు ధర రాకుండా ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ముత్యాల మహిపాల్‌రెడ్డి, పగిళ్ల సుధాకర్‌రెడ్డి, నాయకులు పగిళ్ల రాంరెడ్డి, వస్పరి పారిజాతామహేశ్, చిల్లర జంగయ్య, పీసర్ల మహిపాల్‌రెడ్డి, గునిగంటి మల్లేశం, చేరాల నరసింహ, చింతకింది కిరణ్, కుడికాల బలరాం, సీత శ్రవణ్, గోడళ్ల ప్రభాకర్, రాగీర్ సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి, ముద్దం సత్యంయాదవ్, సరసాని నర్సిరెడ్డి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి మండలం అంతమ్మ గూడెంలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కొలుపుల అమరేందర్

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక మారాలి

- జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ డైరెక్టర్ రఘురాంరెడ్డి
- నల్లగొండలో ముగిసిన దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ అధికారుల సమావేశం

సమావేశంలో పాల్గొన్న అధికారులు, శాస్త్రవేత్తలు

నల్లగొండ, మార్చి 22 : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక మార్చాలని జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం రీసెర్చి డైరెక్టర్ పి.రఘురాంరెడ్డి, విశ్వ విద్యాలయం ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ వి.సుధారాణి, పాలెం పరిశోధన కేంద్రం ఏడీఆర్ ఎం.మల్లారెడ్డి రైతులకు సూచించారు. నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశంలో వారు పాల్గొన్నారు. 2024- 25 సంవత్సరంలో వానకాలం, యాసంగి సీజన్‌లలో చేపట్టాల్సిన పరిశోధనలు, విస్తరణ అంశాల గురించి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో చర్చిస్తూ రెండోరోజు ముగింపు సందర్భంగా పలు అంశాలుపై మాట్లాడారు. రైతులు సాగులో పంటల వైవిధ్యత, యాంత్రీకరణతో పంటల సాగుపై దృష్టిని సారించి కూలీల కొరతను అధిగమించే దిశగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఆ దిశగా పరిశోధనలు చేయాలని సూచించారు. 25 శాతం మంది పైచిలుకు రైతులు వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి వచ్చే విస్తరణ సేవలను పొందుతున్నారని, పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు క్షేత్ర స్థాయిలో ప్రదర్శనలు నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు. పరిశోధన ఫలితాలు ప్రతి రైతుకు అందించగలిగినప్పుడే ఉపయోగం ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలు, విస్తరణాధికారులు మమేకమై వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరుస్తూ కొత్త పుంతలు తొక్కించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పప్పు దినుసులు, నూనె గింజల పంటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నదని, రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కలిగించాలని అన్నారు. ప్రతి సీజన్‌లో రైతుకు కావాల్సిన అవసరాలు తెలుసుకొని ఆ దిశగా ముందుకు సాగాలని, మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాబోయే వానకాలంలో వేసే పంటల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పక్కా ప్రణాళికతో ఉండాలన్నారు. పాలెం పరిశోధన కేంద్రంలో చేస్తున్న పరిశోధన ఫలాలను డాక్టర్ ఎస్. వాణిశ్రీని, వాతావరణ పరిస్థితులపై డాక్టర్ లలితా రాణిని వివరించాలని కోరగా, వారు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆపత్కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వ్యవసాయ స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు సమావేశంలో వివరించారు. రాబోయే వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ అంశాలపై చర్చించారు. అనంతరం డాక్టర్ సుధారాణి ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని వాటర్ ఫర్ పీస్ అనే వీడియోను ఆవిష్కరించారు. అదే విధంగా వ్యవసాయంలో నేటి ప్రాముఖ్యత, నీటి సంరక్షణ అనే అంశంపై డాక్టర్ అనిల్ కుమార్ వివరించారు. ఆ తర్వాత దక్షిణ తెలంగాణ మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులు, శాస్త్రవేత్తలను పదకొండు గ్రూపులుగా విభజించి పరిశోధన, విస్తరణ విభాగంలో పొందు పరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్లు డా. భరత్ భూషన్ రావు, లక్ష్మణ్, కేవీకే, పాలెం, కంపాసాగర్ కోఆర్డినేటర్లు ప్రభాకర్ రెడ్డి, సుల్లాన్, శ్రీనివాస్, లావణ్య, రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ మూల్యాంకనం కేంద్రానికి బోర్డు అధికారులు

- అధ్యాపకులు కేటాయింపులు.. ఇతర అంశాలపై ఆరా
- డీఐఈఓ వ్యవహార శైలి, మూల్యాంకనంపై కమిషనర్‌కు నివేదిక
- అధికారులను ముట్టడి చేసే ప్రయత్నం చేసిన మోడల్ స్కూల్ టీచర్స్

ఇంటర్ బోర్డు అధికారులతో వాగ్వాదం చేస్తున్న మోడల్ స్కూల్ అధ్యాపకులు, క్యాంపు అధికారులు

రామగిరి, మార్చి 22 : నల్లగొండలోని ఇంటర్మీడియట్ మూల్యాంకనం కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సందర్శించారు. ప్రాధాన్యత ప్రకారం మూల్యాంకనం విధులను కేటాంపులు చేయలేదని, డీఐఈఓ దస్రూనాయక్ వ్యవహార శైలిపై ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా బాధ్యులు గురువారం జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు ఫిర్యాదు చేయడంతోపాటు పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించి అధికారులు వచ్చారు. తొలుత వాల్యూయేషన్‌లో ఉన్న అధ్యాపకుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం క్యాంపు అధికారి, డీఐఈఓ కేటాయించిన సీఎస్, ఏఈ ఇతర విధుల్లో ఉన్న అధ్యాపకుల వివరాలు, సీనియారిటీ, బోర్డు నిబంధనల మేరకు ఉన్నాయా..? లేదా అనే విషయాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో సందర్శనకు వచ్చిన బోర్డు అడిషనల్ డైరెక్టర్ చిత్రం యాదగిరి, శ్రీనివాస్‌ను ముట్టడి చేసే ప్రయత్నం చేయడంతో వారు నివేదికలను రాష్ట్ర కమిషనర్‌కు ఇస్తామని, ఆ తదుపరి బాధ్యులపై చర్యలు ఉంటాయని వెళ్లినట్లు సమాచారం.

వర్సిటీ అభివృద్ధికి పాలక మండలి తోడ్పాటు ఎనలేనిది

ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ పాలక మండలి సభ్యులను సన్మానిస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి

రామగిరి, మార్చి 22 : పలు విధాన నిర్ణయాల్లో కీలక భాగస్వామిగా ఉండి యూనివర్సిటీ అభివృద్ధికి పాలక మండలి చేసిన కృషి ఎనలేనిదని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ చౌల్లేటి గోపాల్‌రెడ్డి అన్నారు. ఎంజీయూ పాలక మండలి సభ్యుల వీడ్కోలు సమావేశం శుక్రవారం వర్సిటీలోని ఆర్ట్స్ బ్లాక్ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పాలక మండలి నిర్ణయాలతో యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేశామని, పలు విద్యాపరమైన ప్రగతిశీల నిర్ణయాలలో నేడు ఎంజీయూ ఆదర్శప్రాయంగా నిలిచిందని తెలిపారు.

పరీక్షల విభాగంలో పూర్తి స్థాయి డిజిటలైజేషన్ ద్వారా ప్రక్షాళన, ఇతరత్రా హేతుబద్ధ నిర్ణయాలకు సభ్యులు తోడ్పాటునిచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అల్వాల రవి, మాజీ పాలకమండలి సభ్యులు కొప్పుల అంజిరెడ్డి, ఆకుల రవి, శ్రీదేవి, బోయపల్లి కృష్ణారెడ్డి, ఘన శ్యామ్, కోయి కోటేశ్వరరావు, సూర్యనారాయణ రెడ్డి, సవీందర్ కుమార్, సోమ రమేశ్, ఎంజీయూ సీఓఈ ఉపేందర్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.